

# నవభూమి కరీంనగర్

అనుబంధం

05 అక్టోబర్,2024 శనివారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


# స్వచ్ఛ సంకల్పం



**కరీంనగర్ –నవభూమి:** పట్టణాలు, నగరాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చి..ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తీసుకున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించేలా ర్యాంకుల పేరుతో పోటీపడుతున్నాయి. అప్పటికి ఇప్పటికి పరిశీలిస్తే శుభ్రత విషయంలో మార్పు కనిపిస్తోంది.కరీంనగర్ జిల్లాలో నగరపాలికతోపాటు నాలుగు పురపాలికలున్నాయి. ఆయా పురపాలికల్లో జనాభా ప్రాతిపదికన పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. 2014 కంటే ముందు ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం, బహిరంగ మలమూత్ర విసర్జన, అధ్వానమైన మురుగునీటి కాలువలతో పట్టణాలు, నగరం కంపుమయంగా కనిపించేది. గత పదేళ్లుగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో చేపట్టిన శుభ్రత కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లారు. నగరంలో మరుగుదొడ్లు నిర్మించడం, చెత్తా చెదారం రోడ్ల మీద వేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించారు. స్వచ్ఛతలో ర్యాంకులు మెరుగు పర్చుకున్నారు. దేశవ్యాప్తంగా సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్ అవార్డులో నగరం రెండో స్థానంలో నిలిచి రూ.4 కోట్ల నగదు పురస్కారం అందుకొని గుర్తింపు పొందింది.పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు ఏటా ర్యాంకు మెరుగు..దేశవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశుభ్రత కార్యక్రమాల సర్వేలో కరీంనగర్ నగరపాలిక ఏటా ర్యాంకుల స్థానాన్ని మెరుగుపర్చుకోవడం కనిపించింది. 2014లో 315 స్థానంలో నిలవగా, 2023లో 62వ ర్యాంకు సాధించింది. అదేవిధంగా బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరంగా గుర్తింపు సాధించింది. వ్యక్తిగత మరుగుదొడ్లతోపాటు సులభ్‌కాంప్లెక్స్‌లు నిర్మించారు. ఓడీఎఫ్, ఓడీఎఫ్‌ం, వాటర్ సిటీగా స్థానాన్ని కాపాడుకుంటూ నగర శుభ్రతపై ఎప్పటికప్పుడు పోటీ పడుతోంది.చెత్తా చెదారం తరలింపు ఇంటింటా చెత్త సేకరణతోపాటు తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటికి రెండు డబ్బాలు పంపిణీ చేశారు. ప్రత్యేకంగా స్వచ్ఛ ఆటోలను నడిపిస్తున్నారు. తడి చెత్తను కంపోస్టు యార్డులకు, పొడి చెత్తను పొడి వనరుల కేంద్రం(డీఆర్‌సీసీ)తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇంటి యజమానులు సహకరించకపోవడం, కార్మికులు కూడా పని భారం పేరుతో తడి, పొడి కలిపి తీసుకుంటున్నారు. పొడి చెత్తతో కార్మికులు కొంతమేర అదనపు ఆదాయం పొందుతున్నారు."స్వచ్ఛభారత్ కార్యక్రమం అనేది పరిశుభ్రత ఉద్యమం మాత్రమే కాదు.. ప్రజా శ్రేయస్సుకు ఇదొక కొత్త మార్గం.. స్వచ్ఛతకు అనేక ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి.. స్వచ్ఛభారత్ మిషన్ ఎంత విజయవంతమైతే అంతలా దేశ కీర్తి పెరుగుతుంది." – గాంధీ జయంతి రోజు దిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలివి. నగరంలో పారిశుద్ధ్య పనులకు వినియోగించే వాహనాలు సాధించిన ప్రగతి మురికివాడల్లో సుమారు వెయ్యి ఇళ్లలో స్వచ్ఛ భారత్ కింద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పారిశుద్ధ్య పనులకు స్వచ్ఛ ఆటోలు, కంపాక్టర్, నాలా క్లీనింగ్, ఊడ్చే యంత్రాలు, జెట్టింగ్ మిషన్ కొనుగోలు

స్మార్ట్‌సిటీలో పారిశుద్ధ్య పనులకు జీపీఆర్‌ఎస్, ట్రాకింగ్ సాంకేతిక జోడింపు, స్మార్ట్ డస్ట్ బిన్ల ఏర్పాట్లు డంపింగ్‌యార్డులో చెత్తను తగ్గించేందుకు బయోమైనింగ్ పనులు చేయడం మురుగుశుద్ధి కేంద్రంలో శుద్ధి చేసిన నీటిని మొక్కలకు పోయడం సెప్టిక్‌ట్యాంకుల క్లీనింగ్‌కు రెండు వాహనాలకు రుణాలు ఇప్పించడం.మూడేళ్లకు ఒకసారి సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవడం. సఫాయి కార్మికులకు కిట్లు అందించడం, ఆరోగ్య శిబిరాలు, బీమా సౌకర్యం కల్పించడం.



## ప్రతి కుటుంబానికి

# డిజిటల్ కార్డు

**కరీంనగర్ –నవభూమి:** ప్రతి కుటుంబానికి ఆధార్‌కార్డు వలే డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, కార్డుతోనే రేషన్‌కార్డు, ఆరోగ్యకార్డు, పింఛను ప్రభుత్వ పథకాలన్నీ ప్రామాణికం కానున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.గురువారం కరీంనగర్ గ్రామీణ మండలం తాహెర్‌కొండాపూర్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో 288 చోట్ల ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్ట్ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. గత సర్కార్ పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. డిజిటల్ గుర్తింపు కార్డు ఫ్యామిలీ పెద్దగా మహిళ పేరు మీదనే వస్తుందన్నారు. ఇప్పటికే కర్నాటక, హరియాణాలాంటి రాష్ట్రాల్లో వీటిని అమలు చేస్తున్నామన్నారు. ఆ రాష్ట్రాల్లో ఇక్కడి అధికారులు అధ్యయనం చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.1.50 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేసిందని, రూ.2 లక్షలపై ఉన్న వారికి దసరాలోపు మాఫీ అవుతుందన్నారు. రుణమాఫీలో సాంకేతిక సమస్యలు ఎదురైతే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. చామనపల్లిలోని పలువురు దళితులు మంత్రిని కలిసి ముప్పై ఏళ్లుగా వ్యవసాయ భూమిలో తాము కబ్జాపై ఉన్నామని, ధరణితో తమ భూములన్నీ వేరే వారిపైన నమోదయ్యాయని, సమస్య పరిష్కరించాలని కోరారు. మంత్రి కాన్వాయ్ వస్తుండగా చెర్లబూత్కూర్ వద్ద గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు రోడ్ల పక్కన పని చేస్తుండగా వారి వద్ద వాహనాన్ని ఆపి పలకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో మహేశ్వర్, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, మండల ఏవో సత్యం, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పురుమల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్‌లో చేపల మార్కెట్ కరీంనగర్ పట్టణం : కరీంనగర్‌లో పెద్ద చేపల మార్కెట్ ఏర్పాటుతోపాటు వాటిని నిల్వ చేసేందుకు శీతలగదిని మంజూరు చేయిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. గురువారం నగరంలోని దిగువ మానేరు జలాశయంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లలను విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ.. చేపల మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దిగువ మానేరులో మొదటి దశలో 15 లక్షల చేప పిల్లలు విడుదల చేస్తామన్నారు. మహిళలకు, ఐకేపీ సంఘాల ద్వారా ద్విచక్ర వాహనాలు మంజూరు చేయిస్తామన్నారు. మత్స్యశాఖ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, కమిషనర్ ప్రియాంక, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఛైర్మన్ పిట్టల రవీందర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, నగర మేయర్ వై.సునీల్‌రావు, సహాయ సంచాలకులు భారతి, కార్పొరేటర్లు జయశ్రీ, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## భూమిలో కరిగే సంచి



**కరీంనగర్ -నవభూమి:** రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం తగ్గించడానికి ప్రత్యామ్నాయంగా వినియోగించుకునేలా నగరపాలక సంస్థ అడుగులేస్తోంది. నర్సరీల్లో ఏటా లక్షల్లో మొక్కలు నాటేందుకు విత్తనాలు వేసి మొక్కలు పెంచడానికి ఉపయోగించే ప్లాస్టిక్ సంచులకు బదులుగా ఎకో లాస్టిక్ బ్యాగులు వినియోగంలోకి తెచ్చారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆలోచన విధానాలకు అనుగుణంగా మేయర్ సునీల్‌రావు, అప్పటి కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ చొరవతో భూమిలో కరిగి పోయే బ్యాగులను వాడేందుకు మొగ్గ చూపారు. పద్మనగర్ సమీపంలోని బుల్ సెమన్ సెంటర్‌లోని నర్సరీలో 20 వేల సంచులలో మొక్కలు నాటారు. వీటిని ఇంటింటా పంపిణీ చేస్తున్నారు. ఈ సంచి నాలుగు నెలల్లోనే భూమిలో కరిగిపోయి ఎరువుగా మారుతోందని నగర పాలక ఇంజినీరింగ్ అధికారులు వివరించారు.

## జిల్లా కోర్టు ఆవరణలో బతుకమ్మ సంబరాలు

**కరీంనగర్ -నవభూమి:** జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఇతర న్యాయమూర్తులు జిల్లా కోర్టు ఆవరణలో రెండో రోజు బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ, కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు బతుకమ్మ ఆడారు. జిల్లా అదనపు న్యాయమూర్తులు నీరజ, లక్ష్మీకుమారి, సబ్ జడ్జి శ్రీలేఖ, న్యాయమూర్తులు, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీవీ.రాజ్‌కుమార్, బేతి మహేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.





# వరి కోతలు షురూ



**ఎల్లారెడ్డిపేట -నవభూమి:** వెంకటాపూర్ శివారులో వరిని కోస్తున్న యంత్రం వానాకాలం సీజన్‌లో ఆటుపోట్లను తట్టుకుంటూ వ్యవసాయం చేసిన అన్నదాతలు వరి కోతలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కొన్నిచోట్ల ప్రారంభించారు. పంట ఏపుగా పెరగడం, ఆరోగ్యంగా ఉండటంతో దిగుబడిపై భారీ ఆశలు పెట్టుకున్నారు. సాగునీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరి పంటను రైతులు సీజన్ ప్రారంభంలోనే సాగు చేశారు. వరి పంట చేతికందుతుండగా వర్షాలు విరామమివ్వడంతో కోతలను ఆరంభించారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూరు, గూడెం తదితర గ్రామాలతోపాటు గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, చందుర్తి, రుద్రంగి తదితర మండలాల్లో వరికోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. జిల్లాలో సుమారు 4.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ సంబంధిత శాఖల అధికారులతో ఇటీవల సమీక్షాసమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది. 258 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వరి పంట కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం సేకరణకు జిల్లాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ పరిధిలో 44, మిగతా శాఖల కింద 12 కలుపుకొని మొత్తం 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. జిల్లా మొత్తంగా ధాన్యం దిగుబడిలో 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రానుందని అంచనా వేశారు. అవసరమైతే కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని భావిస్తున్నారు. కేంద్రాల ఏర్పాటుతోపాటు వాటిలో కనీస సౌకర్యాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. 7,777 టార్పాలిన్లు, 766 తూకం వేసే యంత్రాలు, 634 ప్యాడీ క్లీనర్లు, 603 తేమశాతం చూసే యంత్రాలు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి. తాలు, తప్ప లేకుండా ధాన్యాన్ని శుద్ధి చేసి, తేమశాతం 17 ఉండేలా చూసుకొని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచిస్తున్నారు. 13,552 ఎకరాల్లో సన్నరకం సాగు జిల్లాలో రైతుబంధు లెక్కల ప్రకారం 1,34,725 మంది రైతులున్నారు. వానాకాలం సీజన్‌లో ప్రధాన పంటగా వరిని 1,79,672 ఎకరాల్లో సాగు చేశారు. అందులో 13,552 ఎకరాల్లో సన్నరకం, 1,66,123 ఎకరాల్లో దొడ్డు రకాలున్నాయి. సన్నరకం వరికి రూ. 500 బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించడంతో రైతులకు కొంతమేర ఊరట లభించనుంది. సన్న రకాలు ఎకరానికి 18 నుంచి 22 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని భావిస్తుండగా, జిల్లాలో మొత్తం దాదాపు 28,457 క్వింటాళ్లు వస్తుందని అంచనా వేశారు. దొడ్డు రకం ఎకరానికి 25 క్వింటాళ్ల చొప్పున లెక్కిస్తే సుమారు 4,15,307 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో వరి పంట కోత దశకు చేరుకోగా, కొన్ని మండలాల్లో ఈనే దశలో ఉంది. మరికొద్ది రోజుల్లో వరి కోతలు ముమ్మరం కానున్నాయి. ప్రస్తుతం కోతలను ప్రారంభించిన కర్షకులు కొంత మంది అకాల వర్షాల భయంతో ధాన్యాన్ని నేరుగా రైస్‌మిల్లులకు తరలిస్తుండగా మరికొందరు కొనుగోలు కేంద్రాలకు చేరవేస్తున్నారు.

# ముగిసిన కాలం..ఉబికిన జలం

**పెద్దపల్లి -నవభూమి:** ముత్తారం మండలంలో చేతికందేంత లోతులో బావిలో నీరు సెప్టెంబరు నెలాఖరుతో వానాకాలం ముగిసింది. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా వర్షపాతం ఆశాజనకంగా ఉంది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు నాలుగు నెలల్లో ఒక్క ఆగస్టులో మాత్రమే లోటు ఏర్పడింది. మూడు నెలల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఈ వానాకాలంలో జిల్లాలో 14 శాతం అధికంగా వర్షం కురిసింది. దీంతో భూగర్భ జలాలు పైపైకి ఉబికి వస్తున్నాయి. గత నెలతో పోలిస్తే స్వల్పంగా నీటి మట్టం తగ్గినప్పటికీ యాసంగి సాగు అవసరాలకు భరోసా ఏర్పడింది. 2.60 లక్షల ఎకరాల్లో పంటలు ఈ ఏడాది తొలకరి ముందుగానే పలకరించినా జులై రెండో వారం ఆరంభంలో భారీ వర్షాలు కురిశాయి. జలాశయాలు, చెరువులు, కుంటల్లోకి నీరు సమృద్ధిగా చేరడంతో మానేరు, హుస్సేన్‌మియా వాగులు, గోదావరి ఉప్పొంగి ప్రవహించాయి. ఆగస్టులో మాత్రం వరుణుడు ముఖం చాటేయడంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. నాలుగు నెలల్లో సాధారణం 886 మి.మీ. కాగా 1,013.9 మి.మీ నమోదైంది. ఈ వానాకాలంలో దాదాపు 2.60 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. 3.89 మీటర్ల లోతులో నీరు గోదావరి, మానేరు, ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతమైన జిల్లాలో భూగర్భ జలాలు పైకి వచ్చాయి. జిల్లాలో ప్రతి నెలా 33 ఫిజోమీటర్ల ద్వారా నీటి లెక్కలు తీస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 3.89 మీటర్ల లోతులో నీటి మట్టం ఉబికివస్తోంది. అత్యల్పంగా అంతర్గాం మండలం మొఘల్‌పహాడ్‌లో 1.03 మీటర్ల లోతులో ఉండగా, అత్యధికంగా మంథని మండలం వెక్లాస్‌పూర్‌లో 18.70 మీటర్ల లోతులోకి వెళ్లింది. గత నాలుగు నెలల గణాంకాలు పరిశీలిస్తే భూగర్భ జల మట్టం రెట్టింపు స్థాయికి ఎగిసింది.



## స్కీంల పేరుతో మోసం!



**సిరిసిల్ల –నవభూమి:** జిల్లాలో మధ్య తరగతి కుటుంబాలే లక్ష్యంగా దసరా, దీపావళి పండగల పేరున స్కీంలకు రూపకల్పన చేశారు.కష్టపడి కూడబెట్టుకున్న సొమ్మును కొట్టేసేందుకు కేటుగాళ్లు పన్నాగం పన్నుతున్నారు.వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో దసరా ధమాక పేరుతో 'రూ.100 కొట్టు మేకను పట్టు' అంటూ జిల్లా ప్రజలకు బంపర్ ఆఫర్ స్కీంను రూపొందించామని ప్రచారం చేసుకున్నారు. మరొకరు రూ.100లతో ఒక కూపన్ కొంటే మద్యం, కోడి, మేకలను లక్కీ డ్రాలో గెలుచుకోవచ్చంటూ పథకాన్ని తీసుకొచ్చారు. వీటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని వ్యాపార కేంద్రాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. నెల రోజుల క్రితం వేములవాడ పట్టణంలో వాహన, గృహోపకరణాల కొనుగోలుకు నెల వారీ వాయిదాలతో భాగస్వాములు కావాలని బ్రోచర్ ద్వారా ప్రచారం చేశారు. చేరిన వారికి ఏడాదిలో లక్కీ డ్రా తీసి వారి పేరు తగిలితే నగదు, పలు రకాల వస్తువులు అందిస్తామని అందులో పేర్కొన్నారు.ఇలాంటి ప్రచారాలు ఎక్కువ కావడంతో పోలీసులు దృష్టి సారించారు. వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో కొడుముంజ, వేములవాడ పట్టణాల్లో స్కీంలు, లక్కీ డ్రాల ప్రచారంతో మోసాలకు పాల్పడుతున్న పది మందిపై బుధవారం కేసులు నమోదు చేశారు.జిల్లాలో మూడేళ్ల క్రితం ఒక సంస్థ ఒకేసారి రూ.30 వేలు చెల్లిస్తే ఆరు నెలల తర్వాత నుంచి రూ.10 వేల చొప్పున మొత్తం లక్ష రూపాయలు మీ సొంతం చేసుకోవచ్చని భారీగా డబ్బులు వసూలు చేసింది. గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని చాలా గ్రామాల్లో చాప కింద నీరులా వ్యాపించింది. డబ్బులు చెల్లించే సమయానికి రేపుమాపు అంటూ కాలం వెళ్లదీశారు. చివరికి తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. వారిపై కేసులు నమోదైనా కట్టిన డబ్బులు మాత్రం రాలేదు. రూ.5 లక్షలకు రెండు పడక గదుల ఇల్లు నిర్మించి ఇస్తామని ఓ స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో ప్రచారం చేసింది. ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. వీరి మాటలు నమ్మి చాలా మంది డబ్బులు కట్టారు. కొన్ని చోట్ల నిర్మాణాలు కూడా ప్రారంభించారు. దీంతో కొందరైతే పాత ఇళ్లను కూల్చివేసుకుని కొత్త ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యారు. కొన్ని నెలలకు సంస్థ నిర్వాహకులు, వారి కింద పని చేసేవారు గ్రామం విడిచి వెళ్లారు. రూ.లక్షల్లో డబ్బులు చెల్లించిన వారు లబోదిబోమంటూ మధ్యవర్తులను ఆశ్రయించారు. వారు కూడా చేతులెత్తేయడంతో పలువురు ఆత్మహత్యకు యత్నించారు. దీనిపై పోలీసులు విచారణ జరిపి సంస్థ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

## క్రిప్టో మాయ!

**మేడిపల్లి –నవభూమి:** రూ.వేలల్లో పెట్టుబడులు పెడితే డాలర్లలో సంపాదన ఉంటుందన్న ఆశ సామాన్య, మధ్యతరగతి వారిని ఆకర్షిస్తోంది.క్రిప్టో కరెన్సీ పేరిట ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొనసాగుతున్న మార్కెటింగ్ వ్యాపారంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. నిర్మల్ జిల్లాలో క్రిప్టోకరెన్సీ ఏజెంట్లపై కేసులు నమోదు కావడంతో ఆన్‌లైన్ పెట్టుబడులు తిరిగి వస్తాయా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. తమకు లాభాలు వచ్చాయని కొందరు చెబుతుంటే.. చాలా మంది నష్టపోయారని జరుగుతున్న ప్రచారం మధ్య పెట్టుబడిదారులు అయోమయంలో ఉన్నారు. పదుల సంఖ్యలో యాప్‌ల ద్వారా వ్యాపారం జరగడం... ఇందులో కొన్ని మూతబడినట్లు చెబుతుండటంతో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి నెలకొంది.సార్లు... స్టార్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ ఏజెంట్లుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. నిర్మల్ జిల్లాలో పలువురు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేయగా ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయుల పాత్ర పైనా చర్చ జరుగుతోంది. ఆయా జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులు ఇటీవల విదేశాలకు వెళ్లినట్లు తెలిసింది.

# స్వశక్తి మహిళలకు అండ



**సారంగాపూర్ –నవభూమి:** పర్యావరణ పరిరక్షణకు, రవాణా సౌకర్యం పెంపొందించేందుకు స్వశక్తి మహిళా సంఘాల సభ్యులకు విద్యుత్తు వాహనాలను అందించేందుకు స్త్రీనిధి, బ్యాంకులు ముందుకు వస్తున్నాయి.పెరుగుతున్న కాలుష్యం తగ్గించడమే కాకుండా పెట్రో ధరల పెరుగుదలతో సాధారణ కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటన్నింటిని అధిగమించి, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈవీ ద్విచక్ర వాహనాలు, ఆటో, ట్రాలీలను అందించేందుకు ముందుకొచ్చాయి. ఇందులో భాగంగా ఇప్పటికే స్త్రీనిధి అధికారులు స్వశక్తి సంఘాలలోని మహిళా సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్త్రీనిధి ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలకు విద్యుత్తు వాహనాలపై రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ద్విచక్ర వాహనానికి రూ.లక్ష వరకు అందిస్తుండగా, ఆటోలు, ట్రాలీ ఆటోలపై రూ.3 లక్షల వరకు స్త్రీనిధి రుణాన్ని అందిస్తున్నారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటికే దాదాపు 75 వరకు ద్విచక్ర వాహనాలను మహిళలకు అందజేయగా, వ్యాపార పరంగా ప్రోత్సహించేందుకు ప్యాసింజర్, ట్రాలీ ఆటోలను అందించేందుకు ముందుకొచ్చారు.డబ్బులు ఆదా పర్యావరణ పరిరక్షణకు ఈ–బైక్, ఆటోలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఇంధన ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో విద్యుత్తు వాహనాలతో డబ్బులు ఆదా చేసుకునే అవకాశముంటుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ద్విచక్ర వాహనాలు అందించగా, ఆటో, ట్రాలీ ఆటోలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా స్వశక్తి మహిళలకు అవగాహన కల్పించి ప్రోత్సహించేలా చూస్తున్నాం.భూ కైలాస్, స్త్రీనిధి, జిల్లా ఇన్‌ఛార్జి అర్హులు ఎవరంటే..స్వశక్తి సంఘంలో సభ్యురాలిగా, సంఘ లావాదేవీల సరిగా ఉండి, మూల ధనం చెల్లించిన మహిళలను రుణానికి అర్హులుగా పరిగణిస్తారు.సంఘ ఆర్థిక లావాదేవీల్లోని ఏ, బీ, సీ, డీ గ్రేడ్లలో ఏదైనా కేటగిరీలో తప్పనిసరిగా సంఘంలో సభ్యురాలై ఉండాలి.గతంలో స్త్రీనిధితో సంఘానికి బకాయి ఉండకుండా చూసుకోవాలి.ఒక సభ్యురాలు గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు రుణం తీసుకునే అవకాశముంది.ద్విచక్ర వాహనాలు, ఆటో, ట్రాలీ ఆటోలకు 11 శాతం వడ్డీపై స్వశక్తి మహిళలకు స్త్రీనిధి రుణాన్ని అందించనున్నారు.ద్విచక్ర వాహనానికి రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు అందిస్తుండగా, అదేవిధంగా ఎలక్ట్రిక్ అటో/ ట్రాలీ, ప్రయాణికులను తరలించే ఆటోలపై రూ.3 లక్షల వరకు అందిస్తున్నారు.ఇందులో సభ్యురాలు 10 శాతం మార్జిన్ మనీ చెల్లిస్తే, మిగతా ఇచ్చిన రుణాన్ని 60 నెలల్లోపు వాయిదాలలో చెల్లించాల్సి ఉంటుంది.రుణం తీసుకున్న మహిళకు స్త్రీనిధి ద్వారా బీమా కూడా వర్తించనుంది.

# రైతు సమస్యలపై దృష్టి

**జగిత్యాల –నవభూమి:** రైతులతో విద్యుత్తు అధికారులు నిరంతరం మెరుగైన విద్యుత్తు సరఫరాపై దృష్టి సారించటంతోపాటు..సమస్యలను పరిష్కరించేలా ఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. రైతు సమస్యలను పరిష్కరించేందుకు 'పొలం బాట' కార్యక్రమం ప్రారంభించారు. విద్యుత్తు అధికారులు రైతుల వద్దకు వెళ్తున్నారు. సీఎండీ ప్రత్యేక దృష్టి సారించటంతో సమస్యలు కొంతలో కొంత పరిష్కారమయ్యేలా కనిపిస్తోంది. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో గత రబీ సీజన్‌లో వరి కోత కోసేందుకు పొలంలో నడుచుకుంటూ వెళుతున్న నలువాల నర్సయ్య అనే రైతు తెగిపడిన విద్యుత్తు తీగలను గమనించక విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం వీధిన పడింది. కనీసం పరిహారం కూడా రాలేదు. ఇలా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. చాలా ఏళ్ల కిందట వేసిన లైన్లు కొన్ని శిథిలావస్థకు చేరి తీగలు దెబ్బతిని తెగిపోతున్నాయి. వాటిని గుర్తించి కొత్త లైన్లు వేయాల్సి ఉంటుంది. సమస్యపై దృష్టి సారించకపోవడంతో ఏటా ప్రమాదాలకు గురై చాలా మంది మృత్యువాతపడుతున్నారు. సంస్థ పరిహారం అందిస్తున్నప్పటికీ సమస్యలను పరిష్కరిస్తే ప్రమాదాలు జరగవని రైతులు పేర్కొంటున్నారు. విద్యుత్తు స్తంభాలపై ఇన్సులేటర్లు చెడిపోయి, సపోర్టు ఇన్సులేటర్ దెబ్బతిని విద్యుత్తు సరఫరా అయి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇండక్షన్ రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.జిల్లాలో మొత్తం 5,04,252 విద్యుత్తు కనెక్షన్లు ఉండగా ఇందులో గృహ 3,21,776, వాణిజ్యం 36,526, వ్యవసాయం 133,880 కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం 22,920 విద్యుత్తు నియంత్రికలు ఉన్నాయి. జిల్లాలో గ్రామాలు, పట్టణాల్లో ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తున్న అధికారులు రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. స్తంభాలు వంగిపోయినా, వదులు తీగలు, నియంత్రికల వద్ద ఎర్తింగ్ వైర్లు చెడిపోవటం, ఇన్సులేటర్లు దెబ్బతిని ప్రమాదాలు జరగటం తదితర సమస్యలపై దృష్టి సారించటంతోపాటు, రైతుల మోటార్లకు కెపాసిటర్లను కూడా బిగించేందుకు అవగాహన కల్పిస్తున్నారు. నెల రోజుల కిందట ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినప్పటికీ అంతగా స్పందన లేకపోవటంతో సీఎండీ వరుణ్‌రెడ్డి, ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించటంతో అధికారులు పొలాలకు తరలుతున్నారు. సమస్యలను నమోదు చేసుకుంటూ సాధ్యమైనవి పరిష్కరిస్తున్నారు. పెద్ద పనులకు నివేదికలు తయారు చేస్తున్నారు.90 శాతం మేర పూర్తి – సాలియా నాయక్, ఎస్ఈ డీఈలు, ఏడీఈలు, ఏఈలు క్షేత్ర స్థాయిలో తిరుగుతున్నారు. ఇప్పటికే 90 శాతం మేర పూర్తి చేశారు. ఈ కార్యక్రమం నిరంతరం ఉంటుంది. రైతుల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తారు. ప్రమాదాలు కొని తెచ్చుకోకుంటా ఏదైనా సమస్య ఉంటే సిబ్బందికి తెలియజేయాలి. లూజ్ వైర్లు, వంగిన స్తంభాలను బాగు చేస్తాం. రైతులు కూడా కెపాసిటర్లు బిగించుకోవాలి.

